క్లుప్తంగా

జాతీయ నాయకుల చిత్ర పటాలు అందజేత


గాంధీ, పొట్టి శ్రీరాములు చిత్ర పటాలను తహసీల్దార్‌కు అందజేస్తున్న దృశ్యం

ఆస్పరి: స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లకు స్వాతంత్య్ర సమరయోధులు మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు చిత్ర పటాలను ఆర్యవైశ్య సంఘం నాయకులు బుధవారం అందజేశారు. స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సొసైటీ కార్యాలయం, జెడ్పీ ఉన్నత, ప్రాథమిక, కస్తూర్బా పాఠశాలలకు చిత్ర పటాలను అందజేసినట్లు సంఘం నాయకులు చంద్రశేఖర్, పవన్, సుధాకర్ తెలిపారు.

దశమి ఉత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో చింతలమునిస్వామి


ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో బుధవారం చింతలముని, నల్లారెడ్డి స్వామి వార్ల దశమి ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. ఆలయాల్లో మూలమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి నిత్యపూజలతో పాటు విశేష పూజలు చేపట్టారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గురువారం స్వామి అశ్వాన్ని గ్రామంలో ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ దర్మకర్త పార్వతి, సర్పంచ్ శంకరమ్మ, గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకన్న, రంగన్న పాల్గొన్నారు.

మద్దికెర కార్యదర్శిగా శివకుమార్



మద్దికెర : మేజర్ పంచాయతీ కార్యదర్శిగా శివకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలూరు తాలుకా చింతకుంట గ్రామం నుంచి బదిలీపై వచ్చారు. గతంలో శాశ్వత కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శ్రీహరి పదోన్నతిపై కోవెలకుంట్లకు బదిలీ కావడంతో పలువురు ఇన్‌చార్జులు విధులు నిర్వహించారు. మద్దికెరకు ఆరు నెలల్లో ఐదుగురు ఇన్‌చార్జ్ కార్యదర్శులు మారారు. ఎట్టకేలకు శాశ్వత కార్యదర్శిని నియమించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారంతో గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

కృష్ణగిరి ఎంపీడీఓగా విశ్వమోహన్



కృష్ణగిరి: మండల ఎంపీడీఓగా విశ్వమోహన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ముందు నుంచి ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాబర్ట్‌విల్సన్ అనంతపురం జిల్లాకు వెళ్లగా అనంతపురం జిల్లా పెనుగొండ నుంచి ఈయన ఇక్కడికి వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఈ సందర్భంగా విశ్వమోహన్ తెలియజేశారు.

పకడ్బందీగా సామాజిక తనిఖీ


పింఛన్ జాబితాను తనిఖీ చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి: స్థానిక గ్రామ పంచాయతీకి సంబంధించి ఉపాధి పనులు, సామాజిక భద్రత పింఛన్లపై ఎస్ఆర్‌పీ ఆవులయ్య, డీఆర్‌పీ అనిల్ బుధవారం ఇంటింటికీ తిరిగి కూలీలు, పింఛన్‌దారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఉపాధి పనులకు సంబంధించి ఈ నెల 18వ తేదీన గ్రామ సభ నిర్వహించి, 20వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

నిర్మాణాలను నిలిపివేయండి

మద్దికెర : స్థానిక 9 వార్డులో ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలం, నడిరోడ్డుపై బాత్‌రూం, లెట్రిన్ నిర్మిస్తున్నారని దీంతో తమకు రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని కాలనీవాసులు శ్రీదేవి, లక్ష్మీదేవి, నాగమ్మ తదితరులు తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓ శివకుమార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని చెప్పారు. అధికారులు పరిశీలించి నిర్మాణాలను అడ్డుకోవాలని కోరారు. ఈఓ మాట్లాడుతూ విచారణ చేసి ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని చెప్పారు.

కుండపోత




తెగిపోయిన దొల్తాపురం,చిప్పగిరి రోడ్డు


హొళగుందలో వర్షం కురుస్తున్న దృశ్యం

- హొళగుంద, చిప్పగిరి మండలాల్లో భారీ వర్షం
- పొలాల్లో నిలిచిన వర్షపునీరు
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- తెగిపోయిన చిప్పగిరి దొల్తాపురం రోడ్డు
- నిలిచిన రాకపోకలు


హొళగుంద జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో భారీగా చేరిన వర్షపు నీరు

హొళగుంద: మండల కేంద్రం హొళగుందతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం సాయంత్రం, బుధవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. మంగళవారం 22.8 మీ.మీ వర్షపాతం నమోదు కాగా బుధవారం దాదాపు 5 సెంట.మీ. వరకు వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వీధులు జలమయమయ్యాయి. మండల కేంద్రంలోని హైస్కూల్ గ్రౌండ్, ఎస్‌బీఐ బ్యాంకు, తేరుబజారులో భారీగా వర్షపు నీరు చేరింది. మారెమ్మ గుడి వైపు ఉన్న హైస్కూల్ గేటు వద్ద మోకాలు లోతుకు పైగా నీరు చేరింది. రైతులు సాగు చేసిన పత్తి, వేరుశనగ, వాము, మిరప తదితర పంటలు ఎండుదశలో ఉండగా.. కురిసిన వర్షం వాటికి జీవం పోసినట్లయ్యింది.

చిప్పగిరి మండలంలో 89 మి.మీ వర్షంపాతం..

చిప్పగిరి: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండల కేంద్రంతో పాటు బంటనహాలు, నేమకల్లు, గుమ్మనూరు, నగరడోణ, ఏరూరు తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది.పలు గ్రామాల పొలాల్లో నీరు నిలిచింది. మండంలో 89 మి.మీ వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్ తెలిపారు.

తెగిపోయిన దౌల్తాపురం- చిప్పగిరి రోడ్డు..

మండల కేంద్రం చిప్పగిరి నుంచి దౌల్తాపురం,నంచర్ల మీదుగా రూ.10 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా ప్రభుత్వం బిలుల్లు మంజూరు చేయక పోవడంతో నిర్మాణ పనులు మధ్యలోనధ్యాపివేశారు. రాకపోకలు కొనసాగేందుకు రోడ్డు మార్గంలో ఉన్న వంకల దగ్గర తాత్కాలికంగా సిమెంట్ పైప్‌లు వేసి నామ మాత్రంగా మట్టి వేశారు. మంగళవారం కురిసిన వర్షానికి మట్టి కొట్టుకుపోయి రోడ్డు తెగిపోయింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.


మిరప పొలంలో నిలిచిన వర్షపు నీరు

చట్టాల గురించి అందరికీ తెలియాలి


మాట్లాడుతున్న రంగస్వామి

తుగ్గలి(పత్తికొండ) : భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి అందరూ చట్టాల గురించి తెలుసుకోవాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, లోక్ అదాలత్ ప్యానల్ న్యాయవాదులు నాగేష్, అశోక్‌కుమార్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని కేజీబీవీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. భారత రాజ్యాంగం, లోక్ అదాలత్, భారతీయ చట్టాల గురించి వివరించారు. పాఠశాల ఎస్‌వో షబనా, బార్ అసోసియేషన్ కోశాధికారి రాజశేఖరనాయుడు, సహాయ కార్యదర్శి వాసుదేవనాయుడు, క్లర్క్ రాఘవేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదో తరగతి కీలకం


కృష్ణగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న చంద్రభూషణ్ రావు

కృష్ణగిరి: విద్యార్థులకు పదో తరగతి ఎంతో కీలకమని కర్నూలు అసిస్టెంట్ కమిషన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ చంద్రభూషణ్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, ఫర్నీచర్ తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను పొందాలన్నారు. గురువారం జరగబోయే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకకు సమాయత్తమవుతున్న విద్యార్థుల నృత్యాలను చూసి అభినందించారు. ఓపెన్ స్కూల్ ఇంటర్, పదో తరగతి అడ్మిషన్లు ప్రారంభమయ్యావని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలలో ఓపెన్ ఇంటర్, పదో తరగతి స్టడీ సెంటర్ ఉందని అర్హత కలిగిన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా అధికారి బషీర్, హెచ్‌ఎం కల్పన, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులను చదివించాలి


అరికెర తండాలో మాట్లాడుతున్న జడ్జి హేమ

ఆలూరు: తల్లిదండ్రులు తమ పిల్లలను కచ్చితంగా చదివించాలని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హేమ తెలిపారు. మండలంలోని అరికెర తండా గ్రామంలో ఆలూరు బార్ అసోషియేషన్ కార్యదర్శి వాయుజీవోత్తమరావు ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపట్టాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయవాదులు, ఎస్ఐ సీవీ నరసింహులు పాల్గొన్నారు.

17న చేపల పెంపకానికి వేలం

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని అటవీశాఖ పరిధిలో నున్న వీరగన్నగట్టు చెరువులో చేపల పెంపకానికి ఈ నెల 17వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి ఓబులేష్ గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలానికి సంబంధించి ఇప్పటికే గత నెల 16, 23 తేదీల్లో రెండు సార్లు వేలం నిర్వహించగా ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో మరోమారు నిర్వహిస్తున్నామన్నారు.ఈ ఏడాది జూలై 1 నుంచి 2025 జూన్ 30 వరకు హక్కులు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు కర్నూలు రేంజ్ కార్యాలయంలో 17న ఉదయం 11 గంటల సమయంలో జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలి

మద్దికెర : సర్పంచులు గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు. బుధవారం సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోనున్న వనరులను వినియోగించుకొని ప్రజలకు ఉపయోగపడడమే గాకుండా పంచాయతీకి ఆదాయం పెంచుకునేలా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. అలాగే చెత్త సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించి ఆదాయం సమకూర్చుకోవచ్చన్నారు. సర్పంచులు సుహాసిని, కల్పన, శ్రీదేవి, లక్ష్మీదేవి, కార్యదర్శులు హరి, పరమేశ్, అరుణ కుమారి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఆస్పరి: మండలంలోని తంగరడోణకు ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి గురువారం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య బుధవారం తెలిపారు. తంగరడోణలో జరిగే దశమి ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే చింతలముని, నల్లారెడ్డి స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని చెప్పారు.

బిల్లు లేకుండా విత్తనాలు కొనొద్దు

మద్దికెర : రైతులు గుర్తింపు పొందిన డీలర్ వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఓ రవి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బిల్లు లేకుండా విత్తనాలు కొనుగోలు చేయరాదన్నారు. కొనుగోలుకు సంబంధించి మందుల వివరాలు, విత్తనాలు బిల్లులో నమోదు చేయించుకోవాలని చెప్పారు. అలాగే వ్యవసాయ సహాయకులు పంట నమోదు కార్యక్రమం చేపట్టారని, సంబంధిత అధికారులకు ధ్రువపత్రాలు అందజేసి ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆస్పరి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, వాగ్దేవి ప్రైవేట్ పాఠశాలల్లో కామ్రేడ్ బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి బుధవారం తెలిపారు. ఆయా పాఠశాల్లో విద్యార్థులకు 'రాజ్యాంగం విలువలు, స్థానిక సమస్యలపై పరిపాలన' మరియు స్వాతంత్య్ర ఉద్యమంలో గాంధీజీ పాత్ర అనే అంశాలపై పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం బహుమతులు అందజేస్తామని చెప్పారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

హొళగుంద: స్థానిక తేరు బజారులోని డ్రామా కట్ట వద్ద జమాతే అహ్లెహదీస్ యువత ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలుకు చెందిన మెడ్‌ప్లస్ బ్లడ్ సెంటర్, శ్రీచక్ర నేత్రాలయ సహకారంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. శిబిరంలో అన్ని రకాల రోగాలకు వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 701342700, 7569762506 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు నిట్రవట్టిలో దశమి వేడుకలు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో గురువారం సద్గురు వసేగిరప్ప తాత దశమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు బుధవారం తెలిపారు. కార్యక్రమానికి కర్ణాటక నుంచి భారీగా భక్తులు తరలివస్తారని, ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వరి నాట్లు షురూ

- ఎల్లెల్సీ కింద ఉపందుకున్న సేద్యం పనులు
- వరి నారుకు పెరుగుతున్న డిమాండ్


హొళగుంద సెక్షన్‌లో ప్రవహిస్తున్న ఎల్లెల్సీ, పొలాన్ని ట్రాక్టర్‌తో దమ్ము కొడుతున్న దృశ్యం, హొళగుందలో సాగైన వరినారు


నాట్లు వేస్తున్న కూలీలు

హొళగుంద: గత నెల తుంగభద్ర రిజర్వాయర్ నుంచి దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు నీరు విడుదల కావడంతో మండలంలో సేద్యం పనులు ఊపందుకున్నాయి. ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీలకు అధికారులు ఇటీవల నీరు విడుదల చేశారు. ఇన్నాళ్లు వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగుపై రైతుల్లో అనుమానాలు ఉండేవి. ముఖ్యంగా వరినారుకు కూడా నీరందకపోతుండటం, వరుణుడు కరుణించకపోవడంతో సీజన్ పోయినట్లేనని ఆందోళన చెందారు. ఎట్టకేలకు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో తుంగభద్ర నిండి నీటిని విడుదల చేయడంతో వారిలో ఉత్సాహం మొదలైంది. ఇందుకు మంగళవారం, బుధవారం వర్షం కురవడంతో పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే నారు సిద్ధంగా ఉండటంతో పలు చోట్ల వరినాట్లు ఊపందుకున్నాయి. ఖరీఫ్‌లో జిల్లాలో దాదాపు 43 వేల ఎకరాలకు సాగునీరందనుంది. 2019కు ముందు ఒక కారు పంటతో సరిపెట్టుకుంటున్న ఇక్కడి రైతులు.. తరువాత నాలుగేళ్ల పాటు ఖరీఫ్, రబీలో రెండు సీజన్‌లో వరి పంట పండించారు. గత రెండేళ్లుగా మళ్లీ ఒకే పంటతో సరి పెట్టుకున్నారు. డ్యాం 19వ గేటు తెగి పోవడంతో రైతుల్లో దిగులు మొదలైంది. అయినా ఒక్క పంటైనా పండించుకోవచ్చనే ఆశతో వరినాట్లు వేస్తున్నారు. ఇప్పటికే బోరు బావుల కింద వేసుకున్న వరినారును ఇతర ప్రాంత రైతులు తీసుకెళ్లేందుకు వస్తుండటంతో నారుకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం సెంటు నారు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు పలుకుతోంది. ప్రస్తుతం ఎల్లెల్సీలో ఆంధ్ర కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద దాదాపు 600 క్యూసెక్కులకు గాను కేవలం 336 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది.

'సూపర్ సిక్స్' అమలు ఎప్పుడు బాబూ?

దేవనకొండ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సూపర్ సిక్స్ పథకాల అమలు ఊసెత్తడం లేదని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పి.కోటకొండ గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పథకాల గురించి ప్రజలు ప్రశ్నిస్తుండటంతో.. నాకు ఎంతో చేయాలని ఉంది.. కానీ.. ఖజానా ఖాళీ ఉంది అనే ఒక్క డైలాగ్‌ను సీఎం చంద్రబాబునాయుడు వాడుతూ కాలం వెల్లదీస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 60 రోజులు పూర్తయ్యిందని, హామీల అమలులో దాటవేత ధోరణిని అవలంభిస్తున్నారని మండిపడ్డారు. ఐదేళ్ల పాటు వైఎస్సార్‌సీపీ ఓ ప్రణాళికా ప్రకారం పథకాలు అందజేసిన తీరును ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. చంద్రబాబునాయుడికి ఓటు వేసి నిలువునా మోసపోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. హనుమంతరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి తగ్గని ఆదరణ

ఆలూరు: ఉత్తరాంధ్రలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ గెలుపొందడం తమ పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గలేదని రుజువైందని ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో కూటమి తరఫున అభ్యర్థిని నిలిబెడితే గెలవలేమని తెలియడంతో పోటీ నుంచి తప్పుకున్నారన్నారు. ఉత్తరాంధ్ర నుంచి సూర్యోదయం మొదలైందని, మళ్లీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ హవా మొదలవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా బొత్సా సత్యనారాయణకు అభినందనలు తెలిపారు.

కేసు నమోదు

కృష్ణగిరి: మండలంలోని పందిర్లపల్లె గ్రామ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వీపర్ విషయంపై రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వర్గంపై కేసు నమోదు చేయగా, మరో వర్గంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఖాజావలి తెలిపారు. మాదిగ భూలక్ష్మిపై ఇదే గ్రామానికి చెందిన పల్లెదొడ్డి నడిపి రంగన్న, తిమ్మప్ప దాడి చేయగా అడ్డుగా వెళ్లిన మద్దిలేటిపై దాడి చేశారన్నారు. బాధితురాలు భూలక్ష్మి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో అధికారులదే కీలకపాత్ర

గోనెగండ్ల : గ్రామాల అభివృద్ధిలో అధికారులదే ముఖ్యపాత్ర అని ఈఓఆర్డీ నాగేష్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో గ్రామాల సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా సమగ్ర ప్రణాళిక తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శులు వెంకటేష్, సతీష్, వెంకటే శ్వర్లు, సోమేష్, కృష్ణయ్య,సర్పంచులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించాలి

ఆలూరు: గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని, అందుకు ఫ్యాక్షన్ వలలో చిక్కుని కుటుంబానికి దూరం కావొద్దని ఆలూరు సీఐ శ్రీనివాసనాయక్ సూచించారు. బుధవారం రాత్రి అరికెర గ్రామంలో ఎస్ఐ సీవీ నరసింహులు ఆధ్వర్యంలో గ్రామస్తులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించుకొని, కుటుంబ అభివృద్ధికి తోడ్పడాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తులను దోచుకుంటుంటే ఏమి చేస్తున్నారు?

- ఉరుకుంద క్షేత్ర అధికారులపై సబ్ కలెక్టర్ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్

మంత్రాలయం/ఆదోని రూరల్: ఉరుకుంద ఈరన్న క్షేత్రంలో భక్తులను దోచుకుంటున్న వైనంపై, అధిక ధరలకు టెంకాయలు విక్రయించడం, కల్యాణ కట్టలో గుండుకు రూ.100 అదనంగా వసూలు చేయడంపై 'సాక్షి'లో బుధవారం 'వసూళ్ల జాతర' అనే శీర్షిక ప్రచురితమైన కథనానికి సబ్‌కలెక్టర్ స్పందించారు. ఈ విషయంపై ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ బుధవారం క్షేత్రం అధికారులను సబ్ కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులను దోచుకుంటుంటే పట్టించుకోరా.. ఫిర్యాదుల వస్తే ఏమి చేస్తున్నారంటూ అధికారులను నిలదీశారు. ఇక నుంచి క్షేత్రంలో నిబంధనల ప్రకారమే విక్రయాలు, తలనీలాలు సమర్పణ సాగేలా చూడాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్‌కు ఆదేశించారు. నియమాలకు విరుద్ధంగా నడుచుకునే కాంట్రాక్టర్లు, వ్యాపారులపై కేసులు పెట్టాలని సూచించారు. ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే ఆలయ అధికారులే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంజునాథకు కూడా ఫోన్ చేసి ఉరుకుందలో వసూళ్లు జరిగితే కేసులు నమోదు చేయాలని సూచించారు. నిబంధన ప్రకారం టెంకాయను కచ్చితంగా రూ.20కి విక్రయించేలా చూడాలన్నారు. తలనీలాల టిక్కెట్ రూ.40కి మించి వసూళ్లకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్‌తోపాటు ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు ఉన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా



ఆస్పరి అంబేద్కర్ సర్కిల్‌లో జాతీయ జెండాతో విద్యార్థులు


స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దేవనకొండ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి బస్టాండు, ప్రధాన రోడ్లపై ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు.

ఆస్పరి: 'హర్ ఘర్ తిరంగా'లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో నారాయణ ప్రైమ్ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు 150 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్, అంబేడ్కర్ సర్కిల్, గ్రామ పురవీధుల గుండా జాతీయ నాయకులకు జేజేలు పలుకుతూ జెండాతో ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి హెచ్‌ఎం నరేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముగిసిన శిక్షణ


సంపద తయారీ కేంద్రంలో సర్పంచ్‌లు, అధికారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులుగా సాగిన శిక్షణ బుధవారం ముగిసింది. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌ల భాగస్వామ్యం, పంచాయతీల్లో సంపద సృష్టి తదితర అంశాలపై శిక్షకులు అవగాహన కల్పించారని ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు. వెల్దుర్తి సమీపంలోని సంపద తయారీ కేంద్రంలో ఎరువు తయారీ చేయడం గురించి వివరించామన్నారు. గ్రామాల్లో ఉండే తడి, పొడి చెత్తను సేకరించి వాటి ద్వారా సంపద తయారీ కేంద్రంలో వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించి ఆదాయం సమకూర్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనర్లు శ్రీధర్‌మూర్తి, మస్తాన్‌వలి, సుంకన్న, అనూష, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పత్తికొండ, ఆలూరు
97054 44304 (ఆలూరు, పత్తికొండ)
Office mail : sakshiknladvt@gmail.com